క్లుప్తంగా

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన



ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం రెండో రోజుకు చేరింది. ఘనవ్యర్థాల నిర్వహణ క్షేత్ర స్థాయి పర్యటన , చెత్త సేకరణ, పొడిచెత్త, తడి చెత్త వేరుచేసే విధానం, వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్ గురించి వివరించారు. దీనిపై గొల్లపాలెంలో క్షేత్రస్థాయి పరిశీలన, క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిబాబు, ఈఓపీఆర్డీ నిర్మలా లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ క్లబ్ ప్రతినిధులు



తాడేపల్లి(మంగళగిరి): తాడేపల్లిలోని పలు ప్రాంతాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. విద్యార్థులతో కలసి మొక్కలు నాటిన ప్రతినిధులు విద్యార్థులకు మొక్కలు నాటడం, పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు రావూరి రమేష్‌బాబు, రవీంద్రా రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, జొన్నా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి పరికరాలు అందజేత



మంగళగిరి: నగర పరిధిలోని కుంచనపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో మంగళవారం రూ.3 లక్షల 50 విలువైన పరికరాలు అందజేశారు. ఏసీ, ఫ్రిడ్జ్, కుర్చీలు, డోర్ కర్టన్స్, దిడ్డు, జిరాక్స్ మిషన్, ఇన్వర్టర్, ర్యాక్స్‌లు అందజేశారు. ప్రజలకు సేవలు అందించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ముందుంటుందని గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రావూరి రమేష్ బాబు, రవీంద్రారెడ్డి, మున్నంగి వివేకానంద రెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, శెట్టి రామకృష్ణ, జంగాల వెంకటేష్, చొప్పర బుల్లిబాబు, శ్రీలత, కొండపాటి నరేంద్ర, రాచర్ల శ్రీనివాసరావు, శంకరశెట్టి రమేష్ పాల్గొన్నారు.

సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తిని విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో స్టెప్–స్వశక్తి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్ కళాశాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ కళాశాలల నుంచి తరలిచ్చిన 480 మంది విద్యార్థులు క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, బృందనాట్యం పోటీల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించిన లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ నాయకుల స్ఫూర్తిని విద్యార్థులకు పెంపొందించేందుకు నిర్వహిస్తున్న పోటీలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించడంలో ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం విజేతలకు విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సీహెచ్ రామకృష్ణమూర్తి, స్టెప్ అధికారి రాధిక, కళాశాల పూర్వ విద్యార్థి పి.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్, డైరెక్టర్ డాక్టర్ కె.కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

‘రియల్’ వెంచర్లలో పంచాయతీలకు భూమి కేటాయించాలి

తాడికొండ మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సమావేశంలో తమ శాఖల ప్రగతి నివేదికలు వెల్లడిస్తున్న అధికారులు

తాడికొండ: రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసే వ్యాపారులు పంచాయతీలకు రావాల్సిన 10 శాతం భూమిని ఇవ్వకుండా అనుమతులు లేని వెంచర్లు వేసి కోట్లు దండుకుంటున్నారని, నిబంధనల ప్రకారం పంచాయతీలకు ఆదాయం సమకూరే విధంగా రెవెన్యూ, సీఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని మోతడక ఎంపీటీసీ సభ్యుడు కంచర్ల సాంబశివరావు కోరారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రగతి నివేదికలను చదివి వినిపించగా ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు మాట్లాడుతూ తాడికొండ మండలంతో పాటు మోతడక గ్రామంలో సీఆర్డీఏ అనుమతి, ఎల్‌పీ నంబర్లు లేకుండా ఇష్టానుసారంగా వెంచర్లు వేసి ప్రైవేటు వ్యాపారులు కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. దీని ద్వారా పంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి భారగా గండిపడుతుంది కావున రెవెన్యూ, సీఆర్డీఏ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీడీఓ అత్తోట దీప్తి, తహసీల్దార్ కె.నాసరయ్య పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు

- ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి
- బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ అనూరాధకు సన్మానం



ఎంపీడీఓ అనూరాధను సన్మానిస్తున్న దృశ్యం

తాడికొండ: అంకిత భావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు తప్పక ఉంటుందని ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, శివనాగరాజు దంపతులు పేర్కొన్నారు. తాడికొండ ఎంపీడీఓగా ఎన్నికల విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న అనూరాధకు మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అందరితో కలిసి మెలిసి మండలంలో ఏ చిన్న వివాదం లేకుండా విధులు నిర్వహించడంలో ఆమె చూపిన చొరవ అభినందనీయమన్నారు. అనంతరం తహసీల్దార్ నాసరయ్య, ఎంపీడీఓ అత్తోట దీప్తి, డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పలువురు అధికారులతో కలసి అనురాధను జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

మంగళగిరి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి రోటరీ డిస్ట్రిక్ పబ్లిక్ కో చైర్మన్ ఇసునూని చక్రవర్తి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీకే గరల్స్ హైస్కూలులో మంగళగిరి రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వరంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే మొక్కలు నాటడం పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, కొతారపు వేణుగోపాల్, కాపరౌతు సుందరయ్య, కేవీఎస్ ప్రకాశరావు, ఉడతా శ్రీనివాసరావు, కె.రాము, కె.నాగేశ్వరావు, వడ్లమూడి శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు సిహెచ్.కళ్యాణ్ కుమార్, హెచ్‌ఎం వి.తనూజ పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ



మాట్లాడుతున్న సీఆర్‌డీపీ సూపరింటెండెంట్ సర్కిల్ ఇంజనీర్ విజయకుమార్

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని 2,420 విద్యుత్‌సర్వీసు మీటర్లును విద్యుత్ మంగళవారం తనిఖీ చేసినట్లు సీఆర్‌డీపీ సూపరింటెండెంట్ సర్కిల్ ఇంజనీర్ డాక్టర్ పి.విజయకుమార్ తెలిపారు. స్థానిక అల్లంవారిపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 37 బృందాలు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. 54 సర్వీసులకు అదనపు లోడు కింద అపరాధ రుసుం రూ.2 లక్షల16 వేలు వసూలు చేసినట్లు తెలిపారు. 300 యూనిట్లు లోపు వాడుతున్న విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటికి సౌర పలకలు అమర్చుకోవాలని అవగాహన కల్పించినట్లు చెప్పారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలె రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సీహెచ్, రమేష్, డీపీఈ మూర్తి, ఎంఅండ్ పీ ఈఈ సింగయ్య, ఏఈ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాజీనామా

తాడికొండ: తుళ్లూరు మండలం పెదపరిమి వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పుట్టి శాస్త్రి రాజీనామా చేసినట్లు తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఆలయ కమిటీ చైర్మన్‌గా వైఎస్ రాజశేఖర రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2005, 2009, 2014, 2021, 2024లో వరసగా ఐదు సార్లు ఎన్నికైనట్లు తెలిపారు. కొత్త ప్రభుత్వం రావడంతో ఆలయ కమిటీ చైర్మన్ పదవికి సభ్యులతో సహా రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పోతుగుంట్ల తిరుపతిరావు, చింతల పూర్ణ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు నిర్వహణపై అవగాహన

మేడికొండూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహణపై అవగాహన కార్యక్రమం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. తహసీల్దారు పద్మనాభుడు మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు కుంభా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ధ్యానంపై శిక్షణ

తెనాలిరూరల్: శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానంపై మూడు రోజుల ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సంస్థ తెనాలి సెంటర్ కోఆర్డినేటర్ ఎ.శ్రీకృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన వివరాలను వెల్లడించారు. మారిస్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

గుంటూరు నగర కమిషనర్(ఎఫ్‌ఏసీ) ఎస్.హరికృష్ణ



సౌర విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ హరికృష్ణ

నెహ్రూనగర్: సౌర విద్యుత్ వినియోగం ద్వారా పర్యావరణహితంతో పాటు, ఖర్చులు కూడా తగ్గించుకొని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని గుంటూరు నగర కమిషనర్(ఎఫ్ఏసి) ఎస్.హరికృష్ణ తెలిపారు. మంగళవారం సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌పై ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను నగరపాలక సంస్థ ఈఈ కొండారెడ్డి, డీఈఈ శ్రీధర్‌లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ప్లాంట్ విస్తీర్ణం, విద్యుత్ ఉత్పత్తి, వినియోగం తదితర వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగా సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో యూనిడో సహకారంతో రెండు ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుమారు రూ.4.75 కోట్లతో 500 కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ రోజుకు సరాసరి 2వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందన్నారు. జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే మోటార్ల రన్నింగ్ కోసం రోజుకి 650 నుంచి 1300 యూనిట్లను వినియోగించుకొని మిగిలిన యూనిట్లను గ్రిడ్‌కు అమ్మడం జరుగుతుందన్నారు. సోలార్ ప్లాంట్ వలన ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ని మోటార్ల రన్నింగ్‌కు వినియోగించడం ద్వారా రోజుకు సుమారు రూ.12,350 ఖర్చులు తగ్గుతుండగా, మిగిలిన విద్యుత్ అమ్మకం ద్వారా రోజుకి సుమారు రూ.4,555 ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. వేసవిలో మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్లాంట్ నిర్వహణను కాంట్రాక్ట్ సంస్థే 15 ఏళ్లు బాధ్యత తీసుకుంటుందని, మరో 10 ఏళ్లు పొడిగించుకునే అవకాశం ఉందన్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటు వలన బహుళ ప్రయోజనాలు ఉంటాయని, రానున్న కాలంలో నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

నామినేటెడ్ పోస్టులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మంగళగిరి: కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులలో అధిక భాగం బీసీలకే కేటాయించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో కీలకంగా మారిన బీసీలకు నామినేటెడ్ పదవులతో న్యాయం చేయాలన్నారు, ఎన్నికల హామీలో చంద్రబాబు బీసీ 30 శాతం రిజర్వేషన్ ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 54 శాతం ఉన్న బీసీ 54 శాతం పదవులు కేటాయించాలన్నారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు, గీత, నేత, కుమ్మరి, కమ్మరి, రజక, నాయీ బ్రాహ్మణ వృత్తిదారులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లిక్కర్ షాపులలో 20 శాతం ఉద్యోగాలు కేటాయించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు కుమ్మరి క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పారేపల్లి మహేష్, నాగార్జున, ముప్పన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల సిబ్బంది

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల అడ్డరోడ్డు వద్ద ఉన్న ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్వాతంత్ర్యోదమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజినీర్ హనుమంతరావు మాట్లాడుతూ వ్యాపారం చేసేందుకు భారత దేశానికి వచ్చిన విదేశీయులు దేశాన్ని ఆక్రమించి పాలించే స్థాయికి ఎదిగారన్నారు. 1857 సిపాయిల తిరుగుబాటులో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమం వరకు పలు రకాల ఉద్యమాల వల్లే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్, ఏఓ సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు పాల్గొన్నారు.

డ్రగ్స్, మద్యం, హింసను విడనాడాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

లక్ష్మీపురం: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు యువతీ యువకులు క్విట్ డ్రగ్స్, లిక్కర్, హింస విడనాడాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం కిట్స్ అక్షర ఇంజినీరింగ్ కళాశాల, మలినేని ఇంజనీరింగ్ కళాశాలల్లో డ్రగ్స్, మద్యం, హింసకు వ్యతిరేకంగా సదస్సులు జరిగాయి. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రమాదేవి పాల్గొని మాట్లాడుతూ మాట్లాడారు. నేడు విచ్చలవిడిగా దొరుకుతున్న డ్రగ్స్, మద్యం విద్యార్థుల భవిష్యత్తును పాడు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు పాలకులు డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతామని మాటలు చెప్తున్నారని, ఆచరణలో ఇది ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలను అరికట్టడంలో ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ మాట్లాడారు. కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేద్దాం

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో రోజురోజుకు డ్రగ్స్ భారీగా పెరిగిపోతున్నాయని, వీటివల్ల ఎంతోమంది ప్రజలు, విద్యార్థులు నష్టపోతున్నారని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.యశ్వంత్, షేక్ సమీర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి గుంటూరు నగరవ్యాప్తంగా ఉన్న డ్రగ్స్ నివారించాలని మంగళవారం సంస్థ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ విద్యాసంస్థల్లో చేరకుండా చూడాలన్నారు. డ్రగ్స్ నివారణకు విద్యార్థులందరూ ముందుకు రావాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీటీవీ జాతీయ కళాశ్రీ పురస్కారాలు



కరపత్రాలతో చిట్టినేటి లక్ష్మీనారాయణ, సీహెచ్ మస్తానయ్య

నగరంపాలెం: దేశ సంస్కృతి, భాషపై శ్రమ చేస్తున్న వివిధ రంగాల్లో నిష్ణాతులైన పది మందికి శ్రీటీవీ జాతీయ ‘కళాశ్రీ’ పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు శ్రీటీవీ అధ్యక్షుడు, రంగ స్థల, టీవీ, సినీ నటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం పద్మావతి కల్యాణ వేదిక్పై మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ (ప్రాచీన తెలుగు భాషా పరిశోధన–చెన్నై), కళారంగం నుంచి లండ రుద్రమూర్తి (ఛత్తీస్‌ఘడ్), డాక్టర్ కందిమళ్ల సాంబశివ రావు (ఏపీ), డాక్టర్ కందుకూరి విజయమోహన్(తెలంగాణ), గింజుపల్లి శివప్రసాద్ (పర్వతారోహణ, ఏపీ), ముత్తేవి రవీంద్రనాథ్ (చరిత్ర, పరిశోధన– ఏపీ), చేరెడ్డి మంజులారెడ్డి (ఏపీ), గుంటూరు లక్ష్మి(రంగస్థల, టీవీ రంగం–ఏపీ), రంగం రాజేష్ (జానపద, ఏపీ), డాక్టర్ వలేటి అప్పారావు (టీవీ నిర్మాత, ఏపీ)లకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 15న వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో పురస్కారాల ప్రదానం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, గల్లా మాధవి, జెడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, ఆధునిక వ్యవసాయ అవార్డుగ్రహీత డాక్టర్ ఎం.సురేష్‌బాబు, ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావు హాజరవుతారని అన్నారు.

రూక్ రైడర్స్ చిన్నారులకు చెస్‌లో బహుమతులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): తమ రుక్ రైడర్స్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు రాష్ట్రస్థాయి బహుమతులు సాధించారని కోచ్ ఎల్.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అండర్–11 బాలికల విభాగంలో ఎ.ఆనంది ప్రథమ స్థానం, అండర్–13 బాలికల్లో ఎం.మనస్వి తృతీయ స్థానం, అండర్–7 బాలురలో గగన్ 5వ స్థానం, అండర్–9లో ఎం.చేతన్, వి.నోమిత్‌లు ప్రోత్సాహక బహుమతులు సాధించారని చెప్పారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు పాఠశాలస్థాయిలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని గుంటూరు పశ్చిమ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం స్తంభాలగరువులోని నారాయణ స్కూల్లో కేబినెట్ ఇన్‌స్టాలేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో దేశాన్ని ముందుకు నడిపించే గొప్ప నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా క్లాస్ లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై. శ్రీనివాసరావు, రీజనల్ సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ ఎన్.శ్రీని, సమన్వయకర్త అనుపమ, ఏవో జి. శ్రీనివాసరావు, యువరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

16న బాజీషాహిద్ దర్గాలో తలనీలాల వేలం

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా పెద్ద కాకానిలో వేంచేసి ఉన్న హజరత్ బాజీ షాహిద్ ఔలియా బాబా వారి దర్గాలో గత పది నెలలుగా నిలువ ఉన్న భక్తుల తలనీలాలకు వేలం వేయనున్నట్లు హజరత్ బాజీ షాహిద్ దర్గా కార్యనిర్వహణ అధికారి ముక్తార్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన శుక్రవారం కాకాని బాజీ షాహీద్ ఔలియా వారి దర్గా ఆవరణలో గల కార్య నిర్వహణ అధికారి కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎక్కువ మొత్తంలో వేలంలో పాల్గొన్న వారికి రసీదు ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు.